కబ్జా కోరల్లో ఆర్ అండ్ బి రోడ్డు

గర్భాం చిరత గట్టు బస్టాండ్‌కి ఇరువైపులా నిర్మించిన దుకాణాలు ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులకు గురవుతున్న విద్యార్థులు, ఉద్యోగస్తులు

విశాలాంధ్ర - మెరకముడిదాం: మండలంలో మేజర్ పంచాయతీ గర్భాం గ్రామ చిరత గట్టు మెయిన్ బస్టాండ్ నాలుగు రోడ్ల కూడలి వద్ద గత కొన్నేళ్లుగా వ్యాపారస్తులు తారు రోడ్డుకి ఆనుకొని వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల తారు రోడ్డుకి ఒకటిరెండు అడుగులు కూడా వదలకుండా శాశ్వత నిర్మాణాలు చేపట్టి ఇటు పంచాయతీ వాళ్లకి, అటు ఆర్ అండ్ బి వాళ్లకి ఆక్రమణ దారులు సవాలు విసురు తున్నారు. ఇటీవల వర్షాలతో, ఆక్రమణల కారణంగా నీరు రోడ్డుపై చేరి చెరువును తలపించింది. దీనికి స్పందించిన గర్భాం మేజర్ పంచాయతీ కాలవుల నిర్మాణం నిమిత్తమై ఆక్రమణలు తొలగించాలని ఇటీవల ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వడం జరిగింది. దీనికి స్పందించిన కొంతమంది ఆక్రమణ దారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించి నప్పటికీ, మరి కొంతమంది ఇదేదో పంచాయతీ వారికి సంబంధం లేనట్లు, ఆర్ అండ్ బి స్థలమని ఆర్ అండ్ బి వాళ్ళ తొలగింపు నోటీసులు ఇస్తే, తొలగిస్తామని అంతవరకు ఆక్రమణలు తొలగించేది లేదని భీష్మించుకుని కూర్చుంటున్నారు. దీనితో ఆక్రమణదారుల పుణ్యమా అని రహదారిపై నీరు నిల్వ ఉండడమే కాకుండా, గర్భాం నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రతిరోజు ట్రాఫిక్ జామ్ అవుతుంది. దీంతో సమయానికి వెళ్లాల్సిన విద్యార్థులు, ఉద్యోగస్తులు సకాలంలో కార్యాలయానికి, పాఠశాలలకు చేరుకో లేకపోతున్నారు. గర్భాం చిరత గట్టుకిరువైపులా దుకాణాలు నిర్మించిన ఆక్రమణదారులు వారి వ్యాపార కార్యకలాపాలను దుకాణంలో చేయ కుండా రహదారిపై వ్యాపారాలు చేస్తుం డడంతో ట్రాఫిక్ జామ్ అవ్వడమే కాకుండా, పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గతంలో వేగంగా వస్తున్న గంటలు లారీ గ్రామానికి చెందిన ఓ బాలుడిని ఈ చిరత గట్టు జంక్షన్ వద్ద ఢీకొనడంతో మృతి చెందిన సంఘటన ఉంది. తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి, చిరత గట్టు కిరువైపులా ఆక్రమణలు తొలగించాల్సిందిగా గర్భాం మేజర్ పంచాయితీ గ్రామస్తులు కోరుతున్నారు.

నూతనంగా లక్ష పదివేల వితంతువులకు పించన్ల పంపిణీ

- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విశాలాంధ్ర-విజయనగరం: ఎన్టీఆర్ భరోసా పథకం కింద అందించే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సరళీకృతం చేసి నూతనంఖ 1.09 లక్షల మందికి పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారిక సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే వెంటనే భార్యకు ఏ నెలకు ఆ నెలే పింఛను ఇచ్చే విధానాన్ని గత ఏడాది నవంబర్ నుంచి అమలులోకి తెచ్చామని తెలిపారు. దీన్నే స్పౌజ్ క్యాటగిరీగా గుర్తిస్తూ పింఛను మంజూరు చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గత ఏడాది నవంబరు 1వ తేదీన శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా స్పౌజ్ క్యాటగిరీ కింద ఎప్పటికప్పుడు వితంతువులకు పింఛను మంజూరు చేస్తామని ప్రకటించారని, అప్పటినుండి ఈనెలలో పెన్షన్ తీసుకుంటూ చనిపోయిన పెన్షన్‌దారుల భార్యలకు మరుసటి నెల నుంచి వితంతు పెన్షన్ పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. 2023 డిసెంబర్ ఒకటవ తేదీ నుండి 31 అక్టోబరు 2024 మధ్యకాలంలో స్పౌజ్ పెన్షన్‌కు అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు ఇస్తామని గతంలో చెప్పామని అన్నారు. ఈ పెన్షన్ల మంజూరు చేస్తున్న క్రమంలో 2019 ఏప్రెల్ నుండి నవంబర్ 2023 మధ్యకాలంలో అర్హులైన పలువురికి అప్పటి ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా స్పౌజ్ కోటాలో పెన్షన్లు ఇవ్వలేదని పలువురు చేసిన విజ్ఞప్తిపై క్షేత్రస్థాయిలో పరిశీలించగా ఆకాలంలో అర్హత కలిగిన పలువురికి పెన్షన్ ఇవ్వని విషయాన్ని గుర్తించటం జరిగిందని చెప్పారు. వీరందరికీ కొత్తగా పెన్షన్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఈ రెండు కేటగిరీలలో మొత్తం 1,09,155 మందికి కొత్తగా పెన్షన్ పొందేందుకు అర్హత కలిగి ఉన్నారని అన్నారు. ఆగస్టు నెల నుంచి కొత్తగా వీరందరికీ వితంతువు (ఇప్పటికే పింఛను తీసుకుంటున్న భర్త చనిపోయిన వారికి) క్యాటగిరీలో పింఛను మంజూరుకు విధాన పరమైన నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వీరికి రేపటి నుంచి రూ.4 వేల చొప్పున పింఛను పంపిణీ చేయనున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం ప్రతినెల రూ.43.66 కోట్లు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించనుందని ఈ ప్రకటనలో తెలియజేశారు.

ఎస్సీ, ఎస్టీలపై కులవివక్ష చూపితే చర్యలు

విశాలాంధ్ర - బొబ్బిలి : మండలం కింతలవానిపేటలో తహశీల్దార్ ఎం.శ్రీను అధ్యక్షతన ఏర్పాటు చేసిన పౌర హక్కుల దినం అవగాహన సదస్సుకు స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించింది. గురువారం కింతల వాని పేట గ్రామంలో పోలీస్ రెవెన్యూ సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారులతో పౌర హక్కుల అవగాహన దినం సదస్సును తహశీల్దార్ ఎం.శ్రీను అధ్యక్షతన ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా తహశీల్దార్ ఎం.శ్రీను మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ ఎస్టీలు కులాలపైన వివక్షత చిన్నచూపు చూడరాదని వారి హక్కులకు భంగం కలిగించరాదన్నారు. హక్కులకు భంగం కలిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దళితవాడలో సందర్శించి దళితులకు మౌలిక సదుపాయాల కల్పనపై సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. గ్రామంలో పాఠశాలకు రోడ్డు సౌకర్యం లేదని రోడ్డు సౌకర్యం కల్పించాలని, రోడ్డుపైన పశువులు కట్టడంతో పారిశుద్ధ్యం లోపంతో ఇబ్బంది పడుతున్నామని తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ అవగాహన సదస్సులో పట్టణ సీఐ సతీష్ కుమార్, ఆర్ఐ కొల్లి రామ్ కుమార్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.కామేష్, ఎస్.రంగరాజు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.కామేష్, ఎస్.రంగరాజు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపట్టి కమిషనర్ నల్లనయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జె.కామేష్, ఎస్.రంగరాజు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేసిన 15 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారని వారికి ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం లేనందున వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఆప్కాస్‌లో ఉన్న పారిశుధ్య కార్మికుల పోస్టులను భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి వారిని ఆదుకోవాలని అన్నారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికులకు ప్రభుత్వ పండగ సెలవు దినాలు అమలు చేయాలని, కార్మికులకు పనిముట్లు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్లో ఉన్న ప్రతి మున్సిపాలిటీ నగరపాలక సంస్థల్లో పర్మినెంట్ కార్మికులకు రెండు సంవత్సరాల సరెండర్ లీవ్ బకాయి ఉందని, కానీ విజయనగరం నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికులకు నాలుగు సంవత్సరాలు సరెండర్ లీవ్ బకాయి ఉండడం అన్యాయమన్నారు. వెంటనే దీనిపై ప్రభుత్వం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పొడుగు రామకృష్ణ, దల్లై శ్రీను, కళ్యాణ శ్రీను, చిరంజీవి, తదితర కార్మికులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - గరివిడి: పట్టణంలో ఎస్డిఎస్ కళాశాలలో విద్యార్థులందరికీ మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చీపురుపల్లి ఆర్డీవో ఆశయ్య, డీఎస్పీ రాఘవులు, ఎక్సైంజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చక్రవర్తి, ఎస్డిఎస్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, గరివిడి తహశీల్దార్ బంగార్రాజు, శ్రీరామ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువతి యువకులకు ప్రాణాంతకమని, ఒక్కసారి వాటికి అలవాటు పడితే దానిని దూరం చేయడం చాలా కష్టమన్నారు. మాదకద్రవ్యాలు మెదడు, గుండె, కాలేయం, కిడ్నీలు వంటి అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. మాదకద్రవ్యాలు ఎక్కువగా వాడటం, విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్, విద్యార్థులు,కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్

విశాలాంధ్ర - రాజాం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రభుత్వం మహిళా సంక్షేమానికి తగిన ప్రాధాన్యత కల్పిస్తోందని ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ పేర్కొన్నారు. ఇటీవల రేషన్ డీలర్ల రాష్ట్ర అసోసియేషన్ కమిటీలోకి స్థానం దక్కిన రాజాం మండలం అంతకాపల్లి డిపోకు చెందిన డీలర్ల సమాఖ్య రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వాకుముల్ల జోత్స్నదేవిని, రాజాం పట్టణం తాణావీధి డిపో డీలర్ డీలర్ల సమాఖ్య రాష్ట్ర జాయింట్ సెక్రటరీ లలితకుమారిని ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ శాలువాతో సత్కరించి, పుష్ప గుచ్చం అందజేసి అభినందించారు. రేషన్ డీలర్లు రేషన్ బియ్యం పంపిణీ సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నేడు టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్నిక

విశాలాంధ్ర - భోగాపురం: టీడీపీ మండల పార్టీ అధ్యక్షుని ఎన్నిక శుక్రవారం నిర్వహిస్తామని కర్రోతు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు భోగాపురం మండల టిడిపి పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈ ఎన్నికకు మండలంలోని టిడిపి సీనియర్ నాయకులు,మండల టిడిపి క్లస్టర్ యూనిట్, బూత్ ఇంచార్జిలు, కో ఇంచార్జిలు,అనుబంధ కమిటి నాయకులు,టిడిపి కార్యకర్తలు పాల్గొనాలని సత్యనారాయణ కోరారు.

విశ్వవిద్యాలయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన ఆశ

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని అరిగిపాలేం గ్రామానికి చెందిన తొండవరపు వెంకటరమణ,నాగమణి దంపతుల కుమార్తె తొండవరపు ఆశ, విశ్వవిద్యాలయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించారు.ఈమె ప్రకాశం జిల్లా, సి.ఎస్.పురంలో గల శిలంవారి పల్లిలోని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో బిఎస్సీ డిగ్రీ పూర్తిచేసిన టి.ఆశ,శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతిలో ఎంఎస్సీ ఎక్స్ టెన్షన్, విభాగంలో అడ్మిషన్ పొంది,అత్యుత్తమ ప్రతిభను కనబరిచి విశ్వవిద్యాలయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించారు.అలాగే ఇటీవల జరిగిన స్నాతకోత్సవ వేడుకలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు.ఒక సాధారణ కుటుంబంలో పుట్టి ఇంతటి ఘనమైన స్థాయిలో విద్యనభ్యసించి పుట్టిన గ్రామానికి తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావడంతో అరిగిపాలెం గ్రామస్తులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో అధిక భారాలు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అలమండ

విశాలాంధ్ర - తెర్లాం: స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం ద్వారా వినియోగ దారులపై అధిక భారాలు పడతాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అలమండ ఆనందరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఈ స్మార్ట్ మీటర్‌లు పెట్టవద్దు అని వాటిని పగలగొట్టాలని ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు అన్నారని ఇప్పుడు మోడీ సూచనలు అనుసరిస్తూ అధాని కంపెనీ తాలూకా స్మార్ట్ మీటర్‌లను ఇంటికి అమర్చడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమవుతో ందన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటి ప్రతి కుటుంబంపై అనేకమైన భారాలు పడుతుంటే ఇప్పుడు స్మార్ట్ మీటర్‌లు బిగించి వీటి వలన 90నెలలు దాదాపు 15వేల రూపాయలు అదనపు భారం పడుతుందన్నారు. అలాగే బిల్ వచ్చిన సుమారు 14 రోజులలో కట్టకపోతే పూర్తిగా వారి ఇంటికి కరెంట్ అనేది తీసివేయడం జరుగుతుందన్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై కార్మికులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఆటో బోల్తా...

5గురు విద్యార్థులకు గాయాలు

విశాలాంధ్ర - కొత్తవలస : మండలంలోని అర్ధన్నపాలెం వద్ద నున్న మోడల్ స్కూల్ నుంచి విద్యార్థులను రోజూ తీసుకెళ్లే ఆటో గురువారం సాయంత్రం స్థానిక లక్ష్మి టైల్స్ ఫ్యాక్టరీ సమీపంలో అదుపుతప్పి బోల్తాపడటంతో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో ఆటోలో డ్రైవర్ ఆనంద్ తోపాటు 6గురు విద్యార్థులు ప్రయానించగా 5గురికి గాయాలైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసన్న తెలిపారు. ఇందులో ఎల్.సౌమ్య చంద్రిక, డి.యామిని, సంకిలి శ్రవణ్ కుమార్ లకు స్వల్ప గాయాలు కాగా డి.శిరీష, మహేంద్ర వర్మ ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు ఆమె పేర్కొన్నారు. క్షతగాత్రులను స్థానికుల సహాయంతో పాఠశాల కమిటీ చైర్మన్ మళ్ల రాము, ఉపాధ్యాయులు శివప్రసాద్, భాస్కర్, గణేష్, పి.మణి స్వామీనాయుడు, రాజేష్ తదితరులు హుటాహుటిన కొత్తవలస పిహెచ్‌సికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మహేంద్ర వర్మ కాలికి తీవ్రంగా గాయం కావడంతో స్థానిక సంజీవిని ఆసుపత్రికి తరలించి చికిత్సనందించారు. అలాగే శిరీష నడుంపై బలమైన గాయాం కావడంతో ఆమెకు మెరుగైన చికిత్స కోసం మణికంత ఆసుపత్రికి తరలించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది ప్రమాధఘటనపై పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కాలువలు ఇలా ఉంటే.. రోగాలు రావా...!

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలోని గంగన్నపాడు గ్రామంలో కాలువల్లో మురికి నీరు నిల్వ ఉండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెంది వివిధ రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన మరడానా నరేష్ మాట్లాడుతూ ప్రధాన కాలువ పరిశుభ్రంగా లేదని దీనివలన చాలా ఇబ్బందులు పడుతున్నామని, గ్రామ సెక్రటరీకి ఎన్నోసార్లు విన్నవించుకున్నప్పటికీ ఇదిగో గ్రాంట్ వచ్చింది, అదిగో గ్రాంట్ వచ్చింది, ఇక్కడ మురికి నీరు నిల్వ ఉండకుండా చేస్తాం అంటూ కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. నీరు నిల్వ అయి పచ్చగా మారితే రోగాలు రావా అని ప్రశ్నించారు. ఈ విషయమై గ్రామ సెక్రటరీని వివరణ కోరగా తాను ప్రస్తుతం లీవ్‌లో ఉన్నానని, గ్రామానికి వెళ్లి పరిశీలించి పూడికలు తీయిస్తానని వివరణ ఇచ్చారు.

ఎస్.కోటలో కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు ఎస్.కోట పరిధిలోని దారపర్తి, బొడ్డవర పంచాయతీలకు చెందిన 12 గిరిజన గ్రామాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. డిఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో 16 ఎస్ఐలు, 85 మంది పోలీసులు పాల్గొన్నారు. గ్రామాల్లో ఇళ్లు, బహిరంగ ప్రదేశాలను శోధించినప్పటికీ, నాటుసారా, గంజాయి లేదా అక్రమ ఆయుధాలు దొరకలేదు. అనుమానితులు పారిపోయే మార్గాలను బ్లాక్ చేసిన

పోలీసులు, గంజాయి అక్రమ రవాణా, ఆయుధాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్.కోట సిఐ వి.నారాయణ మూర్తి ఈ ఆపరేషన్ ద్వారా నేర నియంత్రణ, ప్రజా భద్రత లక్ష్యాలను పోలీసులు సాధిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

అంకితభావంతో సేవలందించండి

విశాలాంధ్ర - భోగాపురం : రిజిస్టర్ కార్యాలయానికి వచ్చే కక్షిదారులకు అంకిత భావంతో సేవలను అందజేయాలని జిల్లా రిజిస్ట్రారు టి. ఉపేంద్ర సిబ్బందికి సూచించారు. గురువారం భోగాపురం సబ్ రిజిస్ట్రారు కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ కు వచ్చిన కక్షిదారులతో ముఖాముఖి మాట్లాడారు. నూతన రిజిస్ట్రేషన్ విధానంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం ద్వారా అవసరమైన సేవలను పూర్తిస్థాయిలో కక్షిదారులకు అందజేయాలన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చిన పలువురు రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఏ ఒక్కరి పైన ఫిర్యాదులు లేకుండా అంకితభావంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భోగాపురం సబ్ రిజిస్ట్రారు పి.రామకృష్ణ, జిల్లా రిజిస్ట్రారు కార్యాలయ సీనియర్ సహాయకుడు బంగారు రాజు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు రూ.148.35 కోట్లు

ఆగస్ట్ 2న జిల్లా వ్యాప్తంగా పంపిణీ జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం: అన్నదాత సుఖీభవ పథకం క్రింద జిల్లాలోని 2,19,503 మంది రైతులకు లబ్ది చేకూరనుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఆగస్టు 2వ తేదీన జిల్లా వ్యాప్తంగా పంపిణీకి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం జరిగిన ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకంలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకంలో రాష్ట్ర వాటా కింద 2,19,503 మంది రైతులకు 5 వేల రూపాయలు చొప్పున మొత్తం 109.75 కోట్లు, కేంద్రం వాటా కింద పిఎం కిసాన్ ద్వారా 2 వేల రూపాయలు చొప్పున 1.93 లక్షలమందికి 38.60 కోట్లు రూపాయలు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ప్రతి గ్రామ సచివాలయంలో సభ పెట్టి లబ్ధి దారులకు అందజేయాలని చెప్పారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవ పథకం ఉద్దేశ్యం గురించి వివరించాలని, ప్రభుత్వం రైతులకు చేస్తున్న సహాయాన్ని, వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత వల్ల కలిగే లబ్ధి, మారుతున్న ఆహారపు అలవాట్లకు తగ్గట్లు పంటలు పండించడం వంటి విషయాలను విస్తృతంగా ప్రచారం చేయుటానికి కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. నియోజకవర్గంలో జరగబోయే కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొంటారని, జిల్లాస్థాయి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో కేఆర్ఆర్‌సి ప్రత్యేక కలెక్టర్ మురళి, జిల్లా వ్యవసాయాధికారి తారక రామారావు, లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ రమణమూర్తి, జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ అధికారిణి శారద, జిల్లాపరిషత్ సిఈఓ బివి సత్యనారాయణ, సిపిఓ పై.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రామనారాయణంలో గోశాల గృహప్రవేశం

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణం శ్రీమద్రామాయణ ప్రాంగణంలో గురువారం 2వ గోశాల గృహప్రవేశం జరిగింది. ఈ ఉత్సవంలో ట్రస్ట్ సభ్యులు నారాయణం నాగేశ్వరరావు, శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసం

విశాలాంధ్ర - గుర్ల: తాటిపూడి గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు రాయితో కొట్టి, ధ్వంసం చేశారని గ్రామస్తులు చెప్పారు. ఎమ్మెల్యే కళా వెంకట్రావు విగ్రహాన్ని ప్రారంభించారని, ఇంతలోనే ఉదయం చూసేసరికి విరిగిపోయి ఉందని చెప్పారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నారాయణరావు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి దేవాలయం వద్ద ప్రతిరోజు జరిగే అన్నదాన కార్యక్రమానికి పట్టణంలో దాసన్నపేటకి చెందిన దూసి జగన్నాథరావు (లేటు), దూసి సీతారామ శ్రీ పైడితల్లి అమ్మవారి దేవస్థానంనకు లక్ష రూపాయలు అన్నదానం నిమిత్తం విరాళంగా సమర్పించారు. దీనికి సంబంధించిన చెక్కును పైడితల్లమ్మ వారి ఆలయ సూపరింటెండెంట్ వైవి రమణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఏడిద వెంకటరమణ, పూజారులు బండుపల్లి వెంకటరావు, ధనుంజయ్ పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా సెల్ టవర్లు

వినియోగంలోకి రాక గ్రామస్తుల అవస్థలు పట్టించుకోని బిఎస్ఎన్ఎల్ అధికారులు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని కొండ గంగుపూడి పంచాయితీలో గల గిరిజన గ్రామాలకు వేసిన సెల్ టవర్లు పేరుకే తప్ప వినియోగంలోకి రాకపోవడంతో గ్రామస్తులతో పాటు సచివాలయం ఉద్యోగులు, రేషన్ దుకాణం డీలర్, గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, సెల్ఫోన్ వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. కొండ గంగుపూడి పంచాయతీలో కేజీ పూడి పాతఊరు, కొత్త ఊరు, దిబ్బపాలెం, ఎస్.కోట సీతారాంపురం, బంగారయ్య పేట, శొంటివానిపాలెం, సారవాణి పాలెం, కోటయ్య గరువు, సంఘం వలస, బడ్డిచింతల, తదితర గ్రామాలకు సెల్‌ఫోన్ వినియోగదారులు ఉన్నప్పటికీ సెల్ టవర్ లేక సిగ్నల్ లేక నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పుడల్లా పాలకులకు ఆయా గ్రామాల ప్రజలు సెల్ టవర్లు నిర్మించాలని అర్జీలు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గిరిజనుల మొర ఆల కించిన స్థానిక ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి సిఫార్సుతో బిఎస్ఎన్ఎల్ అధికారులు సెల్ టవర్లు ఏర్పాటు చేశారు. ఒకటి గిరిజన ఆశ్రమ పాఠశాల సమీపంలో మరొకటి ఎస్.కోట సీతారాంపురం గ్రామం సమీపంలో ఏర్పాటు చేశారు. వీటి వలన కేజీపూడి పంచా యతీలో గల అన్ని గ్రామాలకు అలాగే సచివాలయ సిబ్బంది పనుల నిర్వహణకు, గిరిజన సాంఘిక సంక్షేమ ఆశ్రమ బాలికల వసతి గృహంలో ఉపాధ్యాయుల హాజరుకు, అత్యవసర సేవలకు ఫోన్ల ద్వారా సమాచారం అందించేందుకు ఉపయోగపడతాయని అనుకున్నా ఫలితం లేకుండా పోయింది. సెల్ టవర్లు నిర్మించి నెలలు గడుస్తున్నా నేటికీ వినియోగంలోకి రాకపోవడంతో దిష్టి బొమ్మల్లా ఉన్నాయే తప్ప ఉపయోగం లేదని గిరిజనులు మండిపడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు బిఎస్ఎన్ఎల్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకునే దాఖలాలు లేవని, ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు బిఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి రెండు సెల్ టవర్లను వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

కింజరాపు వారి వివాహ వేడుకలో రాజాం ఎమ్మెల్యే కొండ్రు

విశాలాంధ్ర-రాజాం : కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు బాబాయ్ ప్రభాకరరావు కుమారుడు వివాహ వేడుకలలో పాల్గొన్న మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శ్రీకాకుళం జిల్లా నిమ్మడలో నూతన వధూవరులు అయిన అశోక్, శ్యామలప్రణవి లను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాజాం నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోళ్ల అప్పలనాయుడు, బొత్స వాసుదేవ నాయుడు, గురువాన నారాయణరావు, వంగా వెంకటరావు, మరిపి జగన్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పద్మలీల గొప్ప సేవలందించారు : భీశెట్టి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : విజయనగరం జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల తొలి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.పద్మలీల గొప్ప సేవలు అందించారని జిల్లా పౌర వేదిక జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. గురువారం ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ పద్మలీలని జిల్లా పౌర వేదిక ఆధ్వర్యంలో వైద్య కళాశాలలో సత్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం, కళాశాలని ఉన్నత స్థితికి తీసుకు రావడం కోసం ఆమె తీవ్రంగా కృషి చేశారని, రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో విజయనగరం జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలకి మంచి గుర్తింపు వచ్చిందని, గడచిన రెండు బ్యాచ్ లుగా వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కూడా పూర్తి సంతృప్తి కరంగా ఉన్నారని పీజీ వైద్య విద్యార్థుల అడ్మిషన్లు కోసం అనుమతి సాధించడంలో డాక్టర్ పద్మలీల విజయం సాధించారని భీశెట్టి అన్నారు. ఈ కార్యక్రమంలో పౌర వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పిడకల ప్రభాకరరావు, తుమ్మగంటి రామ్మోహన్‌రావు, ఇప్పలవలస గోపి, దవడ కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తాం : పట్నాల వెంకటేష్

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : అర్హులైన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి బీసీ యాత సాధికారత రాష్ట్ర మెంబర్ పట్నాల వెంకటేష్ అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం విజయ నగరం 15వ డివిజన్లో పర్యటించి కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో విజయనగరం పట్టణం ఏమాత్రం అభివృద్ధి చెందలేదని ఎమ్మెల్యే అతిథి విజయలక్ష్మి గజపతి రాజు ఆధ్వర్యం పట్టణం అభివృద్ధి చేసి చూపిస్తామని అన్నారు. ఎన్నికలు ముందు ఇచ్చిన హామీ మేరకు నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ పథకాలను అమలు చేశారని రానున్న రోజుల్లో అంతకుమించి సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధిని చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు తాము కృషి చేస్తామని టిడిపి నేతలు ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ పెంటకోటి సత్యనారాయణ, యూనిట్ ఇంచార్జ్ సమ్మెన సురేష్, గండు హరి, గండు శ్రీను, రామానుజ, చిల్లా రవి, చిల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

పాఠశాల ప్రిన్సిపాల్ టి.జయశ్రీ

విశాలాంధ్ర-వేపాడ : మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కు నాయుడుపేటలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు మిగులు సీట్లు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ టీ.జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆగస్టు 4న సోమవారం నాడు స్పాట్ అడ్మిషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు.కాగా 5వ తరగతిలో 45 సీట్లు, 6వ తరగతిలో 7 సీట్లు, 7వ తరగతిలో 10 సీట్లు, 8వ తరగతిలో 6 సీట్లు, 9వ తరగతిలో 19 సీట్లు, 10వ తరగతిలో 18 సీట్లు, అలాగే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 8సీట్లు, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 5 సీట్లు, ఖాళీలు ఉన్నాయన్నారు.అర్హులైన ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు మాత్రమే మిగులు సీట్లలో తక్షణ ప్రవేశాల కోసం పాఠశాలకు వచ్చి తమ బయోడేటా తో కూడిన వివరాలను సమర్పించాలన్నారు. అలాగే ఎటువంటి సందేహాలు ఉన్నా 9542349722, 9491331681, 963033948, నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ఆమె కోరారు.

ఆగస్టు 2న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాని విజయవంతం చేయండి

ఫ్యాప్టో పిలుపు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఆగస్టు రెండున కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉండే ఉపాధ్యాయులంతా పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపు నిచ్చింది దీనికి సంబంధించిన సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించారు ఈ సందర్భంగా చైర్మన్ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు రెండు నెలల జీతాలు వెంటనే ఇవ్వాలన్నారు. పి ఫోర్ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులకు నిర్బంధం చేయరాదన్నారు. 12వ వేతన సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి 30% మధ్యాంతర భృతి ప్రకటించాలన్నారు. సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. నూతనంగా అప్ గ్రేడ్ అయిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధన తప్ప ఏ ఇతర బోధ నేతర కార్యక్రమాలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి కెఈశ్వరరావు, కె జోగారావు, సిహెచ్ సూరిబాబు, ఎన్ పైడి రాజు, విరమణ, ఎం.నగేష్ ఎంఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 354 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంజూరు

విశాలాంధ్ర-విజయనగరం : విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో కొత్తగా 354 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంజూరైనట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ పత్రిక ప్రకటన లో తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీ శుక్రవారం నాడు ఈ మేరకు మంజూరైన కొత్త పింఛన్లను ఆయా లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. 354 మంది వితంతువులకు 14,16,000 మొత్తాన్ని అందించనున్నట్లు చెప్పారు. 61 సచివాలయాల పరిధిలో మొత్తం పింఛన్ల లబ్ధిదారులు 22,848 మంది ఉన్నారన్నారు. పింఛన్ల మొత్తం 9,97,19,000 రూపాయలను శుక్రవారం ఉదయం నుండి పంపిణీ చేయనున్నట్లు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

పంచాయితీలకు నిధులు లేక విలవిల

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో ఉన్న 29 పంచాయితీలకు నిధులు లేక విలవిలలాడుతున్నాయి.కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత పల్లె పండగల్లో సి సి రోడ్లు,డ్రైనేజీలు నిర్మించారు. పంచాయితీలో ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టారు వాటికి ఇప్పుడిప్పుడే బిల్లులు చెల్లిస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులు తోడైతే అభివృద్ధి పల్లెల్లో పరుగులు తీస్తుంది. ఆర్థిక సంఘం నిధులు లేక పంచాయితీలు అపారిశుద్యముతో విలవిలలాడుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి పంచాయతీలకు నిధులు మంజూరయ్యే విధంగా తగు చర్యలు తీసుకుంటారని మండల ప్రజానీకం ముక్తాకంఠంగా కోరుకుంటున్నాను.

క్షేత్రంలో ఘనంగా సుదర్శన జయంతి

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : ప్రముఖ భారతీయ తత్వ దర్శన కేంద్రం శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి దేవాలయంలోగురువారం సుదర్శన జయంతి ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా వేదమంత్రాల నడుమ ప్రత్యేక హెూమాలు, అభిషేకాలు, పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ ఉమాదేవి దంపతులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వివాహ వేడుకలో పాల్గొన్న డా. రాజేష్

విశాలాంధ్ర-సంతకవిటి/రాజాం : రాజాం నియోజకవర్గం సంతకవిటి మండలం రామరాయపురం గ్రామంలో సోషల్ మీడియా కన్వీనర్ దేబారికి రాజు, తేజస్విని ల వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా.తలే రాజేష్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహన్ రావు, మాజీ సర్పంచ్ ఎన్ని శ్రీనివాస రావు, జిల్లా కల్చరల్ వింగ్ అధ్యక్షులు డా.బి.నరేంద్ర మరియు గ్రామ వైఎస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

హ్యాండ్ బోర్ ప్రారంభం

విశాలాంధ్ర-తెర్లాం : మండలంలో కూనాయవలస గ్రామంలో గురువారం ఎక్స్ ఏఎంసి చైర్మన్, ఎంపిటిసి బొమ్మి శ్రీనివాసరావు, సర్పంచ్ బోడెల విజయబాబు, ఎక్స్ ఎంపిటిసి కర్రి సత్యనారాయణ, ఎక్స్ ఎంపిటిసి బొమ్మి లక్ష్మీనాయుడు, కిల్లడా సూర్యం, ఎంపీటీసీ హ్యాండ్ బోర్ ఎంపీటీసీ చేతులమీదుగా ప్రారంభించారని ఎంపిటిసి బొమ్మి శ్రీనివాసరావు తెలిపారు. ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణీలకు పౌష్టికాహారం కిట్‌ల పంపిణీ

విశాలాంధ్ర-రాజాం : రాజాం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పిల్లలకు పౌష్టికాహారం కిట్ లు పంపిణీ చేసారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా సుమారు రూ. 500 విలువ చేసే కిట్ ల పంపిణీ జరిగింది. రోటరీ సభ్యులు ఆకిరి రామారావు, మక్క అప్పలనాయుడు, కొల్లా కృష్ణారావు, ఎస్. వసంతరావు, కిషోర్, ఎన్. శ్రీను, ఆర్రిసిహెచ్ జయదేవ్, తిరుమల, డా. కిరణ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై విచారణ

విశాలాంధ్ర-గుర్ల :చోడవరం అంగన్వాడి కార్యకర్త ఆ పోస్టుకు అర్హురాలు కాదని కొందరు ఫిర్యాదు చేశారు. మరోపక్క తనపై కొంతమంది తప్పుడు ఫిర్యాదు చేశారని. కార్యకర్త కలెక్టర్ కు లేక రాశారు ఈ రెండిటిపై సిడిపిఓ ఆరుద్ర విచారణ చేపట్టారు నివేదిక సిద్ధం చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణలో మీ సేవలు శ్లాఘనీయం

ఆత్మీయ వీడ్కోలు సభలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సుదీర్ఘ కాలం పోలీసుశాఖలో బాధ్యతాయుతంగా, ఎంతో క్రమ శిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ఆర్.ఎస్.ఐ. ఎ.ఆర్.పండాను జిల్లా పోలీసుశాఖ తరుపున జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - శాంతిభద్రతల పరిరక్షణలో ఆర్మ్డ్ రిజర్వు పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు. పోలీసు విధులను సమర్ధవంతంగా నిర్వహించడం చాలా కష్టతరమన్నారు. క్లిష్టపరిస్థితులు, విభిన్న వాతావరణంలో విధులు నిర్వహించడంతో పోలీసు ఉద్యోగులు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టలేని పరిస్థితులు ఉంటాయని, తద్వారా ఉద్యోగ విరమణ చేసే సమయానికి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఆర్.ఎస్.ఐ. ఎ.ఆర్.పండా ఆర్మ్ డ్ రిజర్వు విభాగంలో సమర్ధవంతంగా, ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహించారన్నారు. మావోయిస్టులు కార్యాకలాపాలను నియంత్రించుట లోను, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టుటలో ఎటువంటి రిమార్కులు లేకుండా సుమారు 40సం.లు పోలీసుశాఖకు సేవలందించడం అభినందనీయ మన్నారు. ఉద్యోగ బాధ్యతలతోపాటు, వారి పిల్లలను కూడా ఉన్నత. విద్యావంతులుగా తీర్చిదిద్ది, ఉన్నత స్థానంలో నిలిచేలా చేసారన్నారు. ఉద్యోగ విరమణ తరువాత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, సమాజానికి మంచి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన బెనిఫిట్స్ రావడంలో ఇబ్బందులు తలెత్తితే, పరిష్కారానికి రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ఉంటామన్న భరోసాను జిల్లా కల్పించారు. అనంతరం, ఉద్యోగ విరమణ చేసిన ఆర్ఎస్ఐ ఎ.ఆర్.పండా దంపతులను జిల్లా పోలీసుశాఖ తరుపున జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆత్మీయ వీడ్కోలు పలికారు. అదే విధంగా జిల్లా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరుపున జిల్లా ఎస్పీ గిఫ్ట్, చెక్లను అందజేసారు. ఉద్యోగ విరమణ చేసిన అధికారులు మాట్లాడుతూ తమ సర్వీసులో సహాయ,సహకారాలను అందించిన అధికారులు, సహెూద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఎఆర్ జి.నాగేశ్వరరావు, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలా రావు, రిజర్వు ఇన్స్పెక్టర్లు ఎన్.గోపాల నాయుడు, టి.శ్రీనివాసరావు, పలువురు ఆర్.ఎస్.ఐ.లు పోలీసు అసోసియేషను అధ్యక్షులు కే.శ్రీనివాసరావు, ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీసు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని, ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కూటమి ప్రభుత్వానికి చేయూత అందించండి

టిడిపి రాష్ట్ర ఉప అధ్యక్షులు సుజయ్ కృష్ణ రంగారావు

విశాలాంధ్ర-బొబ్బిలి : రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధి పథకాల అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు మద్దతు తెలియజేయాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వం పై చేస్తున్న తప్పుడు ఆరోపణలు ప్రజల ఖండించాలని మాజీ మంత్రి టిడిపి రాష్ట్ర ఉప అధ్యక్షులు సుజయ్ కృష్ణ రంగారావు పిలుపునిచ్చారు. మండలం కొత్తపెంట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మాజీ మంత్రివర్యులు, జోన్ 2 కోఆర్డినేటర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు చేపట్టారు. తొలి అడుగు కార్యక్రమంలో పెద్దఎత్తున తెలుగుదేశం శ్రేణులు పాల్గొన్నారు. సుజయ్ కృష్ణ రంగారావు గారు కొత్తపెంట గ్రామంలో ఇంటింటికి చేరుకొని ఏడాదిలో తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతర విలేకరులతో మాట్లాడారు.కూటమి ప్రభుత్వం కచ్చితంగా పెన్షన్లు ఒకటో తారీకుకి ఇవ్వటమే కాకుండా ఆగస్టు ఒకటో తేదీ నుంచి అనేక కొత్త పెన్షన్లు కూడా పెద్ద సంఖ్యలో మంజూరు చేసిన ఘనత కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి దక్కిందని అన్నారు. ప్రజలు సంక్షేమం గురించి రాష్ట్ర అభివృద్ధి గురించి పూర్తి దృష్టి సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం బలంగా పనిచేస్తుందనీ అన్నారు.జగన్ హయంలో జరిగిన మద్యం కుంభకోణం అతిపెద్ద కుంభకోణమని సుజయ్ కృష్ణ రంగారావు అన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా చేసిన నిర్వాహకం ఇప్పటికే నిరూపణ చేయడం జరిగిందనీ తెలిపారు. పెద్ద మొత్తంలో నగదు హైదరాబాదులో ఒక ఫామ్ హౌస్ లో దొరకటం దానికి ఉదాహరణనీ అన్నారు. వేలాది కోట్లు కుంభకోణనికి పాల్పడ్డ సంబంధిత వ్యక్తులతో పాటు జగన్మోహన్ రెడ్డిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అధికారుల్ని బెదిరించే స్థితికి మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేరుకున్నాడని కాబోయే సీఎం అంటూ పగటికలలు జగన్ కంటున్నాడని సుజయ్ కృష్ణ రంగారావు ఆరోపించారు.

నేర నియంత్రణే లక్ష్యంగా 'కార్డన్ అండ్ సెర్చ్' : జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నేరాలను నియంత్రించి, ప్రజల భద్రత, రక్షణ కల్పించుటలో భాగంగా ఎస్.కోట పోలీసు స్టేషను పరిధిలోని దారపర్తి, బొడ్డవర పంచాయతీల్లోని గిరిజన గ్రామాల్లో 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎటువంటి నాటుసారా, గంజాయి లభించలేదన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నేరాలను నియంత్రించుటే లక్ష్యంగా ఎస్.కోట పోలీసు స్టేషను పరిధిలోని దారపర్తి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలైన మునుపురాయి, రాయపాలెం, చప్పనిగెడ్డ, పల్లపు దుంగాడ, రంగవలస, పాతశెనగపాడు, కొత్త సెనగపాడు, దబ్బగుంట గ్రామాల్లోను మూల బొడ్డవర పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం, బొడ్డపాడు, చిలకపాడు, చిట్టెంపాడు, గుణపాడు గ్రామాల్లో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడిన పోలీసులు 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషను నిర్వహించారన్నారు. ఈ బృందాలకు ఎస్.కోట సిఐ వి.నారాయణ మూర్తి, కొత్తవలస సిఐ షణ్ముఖరావు, విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు నాయకత్వం వహించారన్నారు.ఈ 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషనుకు ముందు ఆపరేషను యొక్క ముఖ్య ఉద్దేశ్యాన్ని, ఆపరేషనులో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆయా గ్రామాల్లోని ప్రజలతోవ్యవహరించాల్సిన తీరును గురించి ముందుగా డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు వివరించి, దిశా నిర్దేశం చేసారన్నారు. ఈ ఆపరేషనులో 16మంది ఎస్ఐలు, 85 మంది పోలీసు సిబ్బంది బృందాలుగా ఏర్పడి, వారికి నిర్దేశించిన గిరిజనగ్రామానికి చేరుకొని, ఇండ్లు, బహిరంగ ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారన్నారు. అనుమానిత వ్యక్తులు పారిపోయేందుకు అవకాశం ఉన్న మార్గాలను ముందుగా గుర్తించి, ఆయా మార్గాలను పోలీసు బృందాలతో ముందుగానేదిగ్బంధనం చేసామన్నారు. గ్రామాల్లో మకాం వేసిన అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఏర్పాటు చేసామన్నారు. అనంతరం, గ్రామస్థులతో సమావేశమై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ వద్దని, గంజాయి అక్రమ రవాణ, విక్రయాలు, వినియోగంకు దూరంగా ఉండాలన్నారు. లైసెన్సులు లేకుండా ఆయుధాలు కలిగి ఉండడం చట్టరీత్యానేరమని, ఎవరి వద్దనైనా అనుమతులు లేకుండా ఆయుధాలు లభిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించినట్లుగా తెలిపారు.ఈ "కార్డన్ అండ్ సెర్చ్" ఆపరేషన్ లో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్.కోట సిఐవి.నారాయణమూర్తి, విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, కొత్తవలస సిఐ షణ్ముఖరావు, 16మంది ఎస్ ఐలు, 85మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 19 జలవనరుల పనులకు రూ. 246 కోట్లతో ప్రతిపాదనలు

ప్రధానమంత్రి కృషి సించాయి యోజన క్రింద మరమ్మత్తులు
జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం : ప్రధానమంత్రి కృషి సించాయి యోజన క్రింద మరమ్మత్తులు, ఆధునీకరణ కోసం జిల్లాలో 19 పనులను గుర్తించినట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జలవనరుల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎంకేఎస్ వై- ఆర్ ఆర్ అర్ పథకం క్రింద ఎంపిక చేసిన 19పనుల క్రింద జిల్లాలో 6873 ఎకరాల ఆయకట్టుకు నీరందించ దానికి 246 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు తయారు చేయడమైందని తెలిపారు. ఈ పనులకు జిల్లా స్థాయిలో ఎం.పి అధ్యక్షతన తారలో జరిగే దిశా సమావేశంలో అనుమతి తీసుకొని ప్రభుత్వానికి పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుల సాధ్యతపై రీ వెరిఫికేషన్ చేసి వారంలోగా నివేదికనివ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ ఎస్.ఈ స్వర్ణ కుమార్, తోటపల్లి ఈఈ పి.అప్పలనాయుడు, రెగ్యులర్ ఈఈ ఎం.వి రమణ, టి టి పిఆర్ డిఈ హరి, డిఈలు గోవింద్, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఎంఈఓ
పి.బాలభాస్కరరావు

విశాలాంధ్ర-వేపాడ : వర్షాకాలం దృశ్య ప్రభుత్వ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయ సిబ్బందికి మండల విద్యాశాఖ అధికారి పి.బాల భాస్కరరావు సూచించారు. మండలంలోనికుమ్మపల్లి,దొగ్గపేట పైలకొంపలులో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాలు తరగతి గదులు కిచెన్ గార్డెన్ మొదలగునవి పరిశీలించారు. అంతరం విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీషు, చదివించడం, రాయించడం, చతుర్విధ ప్రక్రియలు చేయించారు.వర్క్ బుక్స్ పరిశీలించారు. అనంతరం శ్రీమతి దొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం నిర్వాహకులను కలసి తగు సూచనలు సలహాలు ఇచ్చారు.ఉపాధ్యాయులు తో సమావేశం ఏర్పాటు చేసి ఎస్ ఆర్ కె వి ఎం కిట్స్ ఆన్లైన్ డ్రిస్ట్యూషన్, మొదలగు అంశాలను పై సూచనలు సలహాలు అందించారు. అనంతరం ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాల ఆవరణలో ఇటువంటి చెత్తాచెదారాలతో పాటు కలుపు మొక్కలను లేకుండా చూసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సత్కారం

విశాలాంధ్ర-భోగాపురం : కొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన కోన. శ్రీనివాసరావు, ఎం.టి.ఎస్ ఉపాధ్యాయులు ను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు, సహచర ఎం.టీ.ఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాధాదేవి, పాఠశాలకు శ్రీనివాసరావు చేసిన సేవలను కొనియాడారు. నిబద్ధత తో పనిచేసిన ఉపాధ్యాయులను గ్రామస్తులు, విద్యార్థులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, చిన కొండ్రాజుపాలెం ఉపాధ్యాయులు గౌరీ శంకర్, వెంకటేష్, పవన్ కుమార్, శ్రీనివాసరావు,శ్యాంసుందర్, వివిధ పాఠశాలల ఎం.టీ.ఎస్ ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు

శ్రీచలపతి స్కూల్‌లో పర్యావరణ అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జమ్మూ నారాయణపురంలో ఉన్న శ్రీచలపతి స్కూల్ విద్యార్థులు పర్యావరణపై అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. చెట్లు సర్వ ప్రాణికోటికి ఆధారమని కాబట్టి అందరూ పర్యావరణం కాపాడటం కోసం మొక్కలు నాటి భవిష్యత్ తరాలకి భరోసాతో కూడిన భూమిని అందించవలెనని ప్లకార్డులు ప్రదర్శించారు. వివిధ రూపాల చెట్ల ఆకృతి తో ఊరేగింపుగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భం గా పాఠశాల డైరెక్టర్ ఎల్.కృష్ణమూర్తి , ప్రిన్సిపాల్ బి.సతీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ స్పృహ ను కలిగివుండాలని వీలైనన్ని చెట్లు నాటి తమవంతు గా పర్యావరణ అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఐ.గోపాలకృష్ణ,అకాడమిక్ డీన్ వి.సందీప్,ప్రైమరీ ఇంచార్జ్ జ్యోతి మరియు ఇతర ఉపాధ్యాయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని స్కూల్ పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటారు.